
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 16 । జులై । 2025



సోమశిలలో 28.200 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 28.200 టీఎంసీలు ఉన్నాయి. 2,793 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 2,800, ఉత్తర, దక్షిణ కాలువలకు 775 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,145
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,419
సవర (8 గ్రాములు)	రూ.75,352

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.6 /29.5

జిల్లాలో బుధవారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలతో ఉక్కపోతగా ఉంటుంది. మంగళవారం గాలిలో తేమ 42 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

డీకేడబ్ల్యూలో మహిళా ట్యూటర్లకు అవకాశాలు

నెల్లూరు (టౌన్): డీకేడబ్ల్యూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలిక హాస్టల్‌లో ట్యూటర్లుగా పని చేసేందుకు మహిళా అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత బీఎస్సీ (గణితం), బీకాం చదివిన వారు అర్హులన్నారు. ట్యూటర్లకు నెలకు రూ.6 వేలు వేతనం, ఉచిత భోజనంతో పాటు వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు 98660 48662 నంబరులో సంప్రదించాలన్నారు.

ఈ నెల 19 నుంచి వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్

- తొలిసారిగా డాక్టర్ల వద్దకే మెడికల్ కౌన్సిల్

నెల్లూరు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్, రీ రిజిస్ట్రేషన్, ఎన్‌ఓసీ, గుడ్ స్టాండింగ్ సర్టిఫికెట్లను అందించనున్నట్లు ఏపీ వైద్యమండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, ఐఎంఏ రాష్ట్ర నాయకుడు అశోక్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఇక్కడ తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి 19, 20 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విజయవాడకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మొదటి సారిగా వైద్యుల వద్దకే మెడికల్ కౌన్సిల్ సిబ్బంది వచ్చి సేవలను అందిస్తున్నారన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఇసుక డ్రెడ్జింగ్ చేస్తూ మత్స్యకారుడి మృతి

- అర్ధరాత్రి తర్వాత పైప్ పగిలి దుర్ఘటన
- పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలించి మృతదేహం వెలికితీత



శివనాగరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై హనీఫ్

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం ఇసుక రీచ్ వద్ద డ్రెడ్జింగ్ పనుల కోసం వచ్చిన ఓ యువకుడు గల్లంతై మృతి చెందగా, మరొక యువకుడు తీవ్రగాయాలతో బయట పడ్డాడు. రాజమండ్రి ప్రాంతానికి చెందిన మత్స్యకారులు కొందరు ఇక్కడ ఇసుక డ్రెడ్జింగ్ పనుల కోసం వచ్చారు. వీరిలో శివనాగరాజు (32), ప్రసాద్ మరికొందరు కలిసి సోమవారం రాత్రి సూరాయపాళెం సమీపంలో పెన్నానదిలో డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఇసుక వెలికి తీసే పైప్ పగిలిపోవడంతో శివనాగరాజు గల్లంతు కాగా, ప్రసాద్ తీవ్రగాయాలతో బయట పడ్డాడు. గల్లంతైన యువకుడి కోసం మంగళవారం పొదలకూరు ఎస్సై హనీఫ్, ఫైర్ అధికారి విజయవరకుమార్ తమ సిబ్బంది గాలించడంతో మృతదేహం లభ్యమైంది. వీరు సూరాయపాళెంలోనే నివాసం ఉంటున్నారు. శివనాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.

కిలో పొగాకు సగటు ధర రూ.196.05

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 668 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 822 బేళ్లు వచ్చాయని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. కిలో గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ.160 లభించింది. వేలంలో 10 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (లీగల్): నెల్లూరు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ గూడూరు, ఉదయగిరిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆఫీసు సబార్డినేట్ పోస్ట్, టైపిస్ట్ కమ్ రిసెప్షనిస్ట్ పోస్టులు ఉన్నాయన్నారు. టైపిస్ట్ కమ్ ఆఫీస్ అసిస్టెంట్‌కు నెలకు రూ.18,500 జీతం ఉంటుందన్నారు. ఆంగ్లంలో టైప్ రైటింగ్ హైయర్ గ్రేడ్ ఉత్తీర్ణత 42 ఏళ్ల వయస్సు ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన ఉండాలని, ఆఫీస్ సబార్డినేట్‌కు 7వ తరగతి 10వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. జీతం రూ.15,000 ఆసక్తి గల ఉన్న వారు పూర్తి చేసిన దరఖాస్తులను చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ, నెల్లూరు ఈ నెలాఖరులోపు పంపాలని కోరారు.

కూటమి పైశాచికం.. పోలీసుల అరాచకం

వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులతో వేధింపులు





ప్రసన్నపై అక్రమ కేసులు పెట్టేందుకు..

మాజీమంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిపై మరో రెండు అక్రమ కేసులు పెట్టేందుకు ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వాంగ్మూలాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నట్లు సమాచారం.

పైశాచిక పాలనతో కూటమి ప్రభుత్వం గిన్నిస్ రికార్డులకెక్కుతోంది. అంబేడ్కర్ రాజ్యాంగానికి పాతరేసి, రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులతో అరాచకం సృష్టిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే నేతలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులతో నెలల కాలంగా జైల్లో ఉండేలా చేస్తున్నారు. మరో వైపు రాజకీయ విమర్శల నేపథ్యంలో పచ్చ మూకలు మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో పోలీసుల సాక్షిగా విధ్వంసం సాగించినా ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



- కాకాణిపై కొనసాగుతున్న కేసుల పరంపర
- ఇప్పటి వరకు 13 కేసులు 7 పీటీ వారెంట్లు
- మాజీ మంత్రి నల్లపరెడ్డి ఇంట్లో విధ్వంసం చేస్తే దిక్కులేదు
- ఆరు రోజుల తర్వాత నామమాత్రంగా ఎఫ్ఐఆర్
- కోవూరు ఎమ్మెల్యే ఫిర్యాదు చేస్తే నిమిషాల్లోనే కేసు నమోదు
- ప్రసన్నకుమార్‌రెడ్డిపై మరో రెండు అక్రమ కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పోలీస్ శాఖ పూర్తిగా కూటమి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో పనిచేస్తుండడంతో జిల్లాలో శాంతి భద్రతలు గాడి తప్పాయి. హత్యలు, అత్యాచారాలతో రౌడీ మూకలు పేట్రేగి పోతున్నా పట్టించుకోని ఖాకీలు వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేయడంలో మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు 13 అక్రమ కేసులు నమోదు చేశారు. కేవలం కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతి పాలనపై ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు కేసులపై కేసులు బనాయించి హక్కులను కాలరాస్తోంది. సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారంటూ, అక్రమ మైనింగ్, గ్రావెల్ తవ్వకాలు, ఎక్సైజ్ శాఖలో చార్జిషీట్ వేసిన కేసుల్లో సైతం పునర్విచారణ పేరుతో కాకాణిని నిందితుడిగా చేర్చుతూ కేసుల పరంపర కొనసాగిస్తూ ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోంది. ఆయా కేసుల్లో బెయిల్ రాకుండా పోలీస్ కస్టడీ విచారణ పేరుతో అడ్డుకుంటోంది. సీడీ ఫైల్స్ లేకుండానే పోలీసులు కస్టడీ వేస్తూ కాకాణిపై వేధింపు పర్వాన్ని కొనసాగిస్తోంది. కాకాణి విషయంలో కూటమి ప్రభుత్వ వ్యవహరిస్తున్న పైశాచికత్వాన్ని చూస్తున్న జిల్లా ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

కాకాణి బయటకు వస్తే..

కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలు నుంచి బయటకు వస్తే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ మరింత దూకుడు పెంచే అవకాశం ఉందని నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన్ను మరిన్ని రోజులు బయటకు రానివ్వకుండా మరిన్ని కేసులు పెట్టేందుకు సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

ఉన్నత న్యాయస్థానాలు తప్పుపడుతున్నా..

వైఎస్సార్‌సీపీ నేతలపై కుట్ర పూరితంగా అక్రమ కేసులు బనాయిస్తున్న క్రమంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం సైతం పోలీసుల వ్యవహార శైలిపై తరచూ అక్షింతలు వేస్తున్నా.. ఆ శాఖ తీరు మాత్రం మార్చుకోవడం లేదు. నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు.

నల్లపరెడ్డి ఇంట్లో విధ్వంసం చేసినా దిక్కులేదు

మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో వేమిరెడ్డి దంపతుల వర్గీయులు వందలాది మంది విధ్వంసం చేసినా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవడంలో మీనవేషాలు లెక్కిస్తోంది. ఈ నెల 7న రాత్రి వేళ ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిని ధ్వంసం చేశారు. స్థానిక సీఐ ఘటనా స్థలానికి చేరుకునే సమయంలో కూడా విధ్వంసకారులు అక్కడే ఉన్నారు. కానీ ఆరు రోజుల పాటు కనీస ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయని పరిస్థితి. కేసు నమోదు చేసినా గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పని అన్నట్లుగా ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు. ఫిర్యాదుదారుడు విధ్వంసకారులను గుర్తించి పేర్లు ఇచ్చినా ఎఫ్ఐఆర్‌లో ఆ పేర్లు పెట్టలేదు. మాజీమంత్రి ఫిర్యాదునే పట్టించుకోకపోవడంపై పోలీసుల తీరుపై ప్రజాగ్రహం పెల్లుబుకుతుంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాజీమంత్రి పసన్నపై ఫిర్యాదు చేసిన నిమిషాల వ్యవధిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సహజంగా ఫిర్యాదుదారుడు జరిగిన ఘటనను మాత్రమే ఫిర్యాదులో ఇస్తారు. కానీ కోవూరు ఎమ్మెల్యే ఏఏ సెక్షన్లు వేయాలో ఫిర్యాదులోనే చూపించడం అవే సెక్షన్లు పోలీసులు నమోదు చేయడం చూస్తుంటే పోలీస్ బాధ్యతలను ఎమ్మెల్యేలు తీసుకున్నారా? అనే సందేహం వ్యక్తమవుతోంది.

మద్యం నిల్వలంటూ కాకాణిపై అక్రమ కేసులు

మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇప్పటికే అనేక కేసులు నమోదు బనాయించింది. రిమాండ్ నుంచి బయట పడకుండా కేసులపై కేసులు పెడుతూ వస్తోంది. 2024 ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలం పంటపాళెంలో మద్యం అక్రమ నిల్వలపై అప్పట్లోనే ఇందుకూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ మేరకు ఆయా కేసుల్లో చార్జిషీట్లు కూడా దాఖలు చేశారు.

- పొదలకూరు మండలం విరువూరులో మద్యం అక్రమంగా నిల్వ ఉంచారని పెంచలయ్యతోపాటు మరో ఏడుగురిపై పొదలకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు సీసీ నంబర్ 528/2024 కేసు నమోదు చేశారు. ఈ కేసు కోర్టులో చార్జిషీటు దాఖలై, కోర్టు విచారణలో ఉంది. నిందితులు కోర్టుకు హాజరవుతున్నారు. రాజకీయ వేధింపుల్లో భాగంగా తాజాగా కేసును పునర్విచారణ పేరుతో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బచ్చు సురేష్‌రెడ్డిపై కేసు బనాయించారు.
- ఇవేకాకుండా 2014లో ఎన్నికలు జరిగిన సమయంలో సైతం అక్రమ మద్యం నిల్వలకు సంబంధించి రాపూరు ఎక్సైజ్ స్టేషన్‌లో క్రైం నంబరు 46/2014, నెల్లూరు-2 ఎక్సైజ్ స్టేషన్‌లో క్రైం నంబరు 47/2014, క్రైం నంబరు 48/2014, క్రైం నంబరు 49/2014 నమోదైన కేసులకు సంబంధించి చార్జిషీటులు దాఖలు చేశారు. ఆయా కేసుల్లో నిందితులు కోర్టుకు హాజరవుతున్నారు. కేసుల విచారణ తది దశలో ఉన్నాయి. అయితే ఆయా కేసులకు సంబంధించి కాకాణిని నిందితుడిగా చేర్చేందుకు కోర్టులో పునర్విచారణ చేయించి ఆయన కేసులు నమోదు చేయడం గమనార్హం.
- ఎన్నికల కోడ్ సమయంలో ఎక్సైజ్ అధికారులు ఎన్నికల సంఘం పరిధిలో పనిచేస్తారు. ఆ సమయంలో నిజాయితీగానే, చిత్తశుద్ధిగానే మద్యం అక్రమ నిల్వలపై ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. తాజాగా కూటమి పాలకులు ఆ కేసులను పునర్విచారణ పేరుతో కాకాణిపై అక్రమ కేసులు పెట్టించారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న నిరసన



అర్ధనగ్నంగా ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

నెల్లూరు (బారకాసు): ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలో భాగంగా మంగళవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి వీఆర్సీ వరకు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచలనరసయ్య, నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులు మూడు రోజుల నుంచి సమ్మె చేపడుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. చాలీచాలని వేతనాలతో ఇంజినీరింగ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లకు రిటైర్మెంట్ చేసిన వారికి ఎటువంటి బెనిఫిట్స్ కల్పించకుండానే అర్థాంతరంగా ఇళ్లకు పంపిస్తున్నారని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించకుంటే 17వ తేదీ నుంచి సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండా ప్రసాద్, మాలకొండయ్య, నరసింహారెడ్డి, ఇంజినీరింగ్ కార్మికుల నాయకులు ఎం. శ్రీనివాసులు, బాలు, ముని, మోహన్‌కృష్ణ, మారుతి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బ్లాస్టింగ్.. మైనింగ్

- ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తెల్లఖనిజం తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు యంత్రాంగం
- పేలుళ్లతో భయభ్రాంతులవుతున్న గ్రామస్తులు



పేలుళ్లకు రంధ్రాలు వేస్తున్న దృశ్యం



పని ప్రదేశంలో హిటాచి యంత్రం పట్టించుకోని అధికారులు

కొండాపురం (ఉదయగిరి): కొండాపురం మండలం బాపనపల్లి (యర్రబొట్లపల్లి)లోని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో కొద్ది రోజులుగా అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా డిటోనేటర్లు, జిలిటెన్‌స్టిక్స్ పెట్టి పేలుళ్లకు పాల్పడుతున్నారు. రేయింబవళ్లు భారీ యంత్రాలు పెట్టి తెల్ల ఖనిజాన్ని వెలికి తీసి తరలిస్తుండడంతో గ్రామస్తులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

గ్రామ సమీపంలో సాగు నీటి చెరువు కాలువను అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో అపారంగా తెల్లరాయి నిక్షేపాలు ఉన్నాయి. గతేడాది పక్కనే ఉన్న మైనింగ్ యజమాని యంత్రాలతో రాయి వెలికి తీసి తనకు లీజు ఉన్న ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే గ్రామస్తులు అడ్డుకోవడంతో ఆగిపోయింది. అత్యంత విలువైన తెల్లరాయి ఖనిజ సంపద ఉండడంతో మరో వ్యక్తి ఇక్కడి ఖనిజ నిక్షేపాలపై కన్నేశాడు. అనాధికారికంగా మండలంలోని రెవెన్యూ, పోలీసు సిబ్బందితో లోపాయికారి ఒప్పందం చేసుకున్నాడు. ఖనిజ సంపదన తవ్వకానికి భారీ యంత్రాలు పెట్టి రేయింబవళ్లు మైనింగ్ చేస్తున్నాడు. పట్టపగలే అనుమతుల్లేకుండా డిటోనేటర్లు, జిలిటెన్ స్టిక్స్ ఉపయోగించి భారీ స్థాయిలో పేలుళ్లకు పాల్పడుతున్నారు. అక్రమ మైనింగ్ ప్రాంతానికి అత్యంత సమీపంలోనే నివాసిత ప్రాంతాలు ఉండడంతో పేలుళ్ల ధాటికి ఇళ్ల గోడలు బీటలు వాలుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పేలుళ్ల సమయంలో కొన్ని రాళ్లు ఎగిరి నివాసాలపై వచ్చి పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేలుళ్ల దెబ్బకు పశువులు, జీవాలు మేపుకునే వారు భయభ్రాంతులకు లోనవుతున్నారు.

అక్రమ మైనింగ్‌పై గ్రామస్తులు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్ తీరును స్పష్టంగా చూపించే వీడియోలను అధికారులకు చూపించారు. అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు ఉపయోగిస్తే పోలీసులు వారిపై కేసు నమోదు చేయాల్సి ఉండగా, కొండాపురం పోలీస్‌స్టేషన్ ఓ హెడ్‌కానిస్టేబుల్ వెళ్లి అక్రమ మైనింగ్ చేసే వారితో ఒప్పందాలు చేసుకున్నారంటూ ఆరోపించారు. అదే సమయంలో అక్కడ పేలుళ్లు చేసేందుకు రంధ్రాలు వేసే ట్రాక్టర్‌ను సైతం వదిలేశారని గ్రామస్తులు పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మైనింగ్ కొనసాగిస్తే గ్రామం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి తప్పదని, అధికారులు స్పందించి తక్షణమే మైనింగ్, బ్లాస్టింగ్‌లను ఆపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డికి ముందస్తు బెయిల్

నెల్లూరు (లీగల్): వైఎస్సార్‌సీపీ ముత్తుకూరు మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డికి కండీషన్లతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్.లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కృష్ణపట్నంపోర్టు సమీపంలో టోల్‌గేట్ ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేశారని ముత్తుకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో రెండో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ముందుస్తు బెయిల్ ఇస్తూ రూ.లక్ష ఆస్తి విలువ కలిగిన ఇద్దరు జామీన్ దార్ల పూచీకత్తు ఇవ్వాలని, పోలీస్ ఇన్వెస్టిగేషన్‌లో సహకరించాలని, సాక్షులను బెదిరించడం చేయరాదని ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా పోలీస్‌స్టేషన్‌లో హాజరవ్వాలని తెలిపారు. ఆ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియకుండా జిల్లా వదిలి వెళ్లకూడదని, పాస్‌పోర్టు స్టేషన్‌లో అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేసు పూర్వాపరాలు ఇవే..

కృష్ణపట్నం పోర్టు లారీ, కంటైనర్ ఓనర్స్‌తోపాటు కృష్ణపట్నం లాజిస్టిక్స్ పేరుతో అసోసియేషన్‌ను ఏర్పాటు చేయించి లారీ, కంటైనర్ల యజమానులను బెదిరించి అక్రమంగా ఎక్కువ బాడుగలు వసూలు చేశారంటూ మొదటి నిందితుడిగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, రెండో నిందితుడిగా మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డితో మరి కొందరిని చేర్చి ముత్తుకూరు పోలీసుస్టేషన్‌లో అక్రమంగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రెండు రోజుల పాటు పోలీసులు కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆ మేరకు ఆ కేసులో ఆయనకు బెయిల్ మంజూరైంది.

అటవీ శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): అటవీ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను ఏపీపీఎస్సీ జారీ చేసింది. ఎంపికైన వారికి కేడర్‌ను బట్టి నెలకు రూ.25 వేల నుంచి రూ.80 వేల వరకు జీతం లభించనుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్లో ఆగస్ట్ ఐదులోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వివరాలకు psc. ap. gov. inను సంప్రదించాలని జిల్లా అటవీశాఖాధికారులు సూచించారు.

పెన్షన్ ధ్రువీకరణ సవరణతో తీవ్ర నష్టం

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (అర్బన్): కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు ప్రవేశ పెట్టిన పెన్షన్ ధ్రువీకరణ సవరణతో కేంద్ర, రాష్ట్రాల పెన్షనర్లకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుందని, ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఆలిండియా పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద భారీ స్థాయిలో విశ్రాంత ఉద్యోగులు ధర్నా చేశారు. విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అన్నారు. వృద్ధాప్యంలో అనేక కుటుంబాలు పెన్షన్ మీద ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. అలాంటి సందర్భంలో కేంద్రం ఇచ్చిందే తీసుకోండి.. భవిష్యత్‌లో ఏమి అడగకూడదనే విధంగా పెన్షనర్లను ఇబ్బంది పెడుతూ చట్టం తీసుకుని రావడం అన్యాయమన్నారు. ప్రతి పెన్షనర్ గౌరవ ప్రదంగా జీవించేందుకు తగిన పెన్షన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందన్నారు. కాలానుగుణంగా పెన్షన్ మొత్తాన్ని పెంచాలన్నారు. అయితే అందుకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 12వ పే కమిషన్, కేంద్రంలో 8వ పే కమిషన్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. అప్పటి వరకు ఐఆర్ ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్‌సీ బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. ఉద్యోగ పెన్షనర్లకు కాంప్రహెన్సివ్ హెల్త్ స్కీంను అమలు చేయాలన్నారు. రైల్వే, విమాన ప్రయాణంలో సీనియర్ సిటిజన్స్ రాయితీని పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 70/75 ఏళ్లకు అడిషనల్ క్వాంటమ్ 10/15 శాతం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర నాయకుడు బాబురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రమణయ్య, కోశాధికారి జె. హజరత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, నాయకులు శ్రీనాథ్, ఖాసీం, శ్రీనివాసులు, సుధాకర్, వీరేంద్రనాథ్, ప్రసాద్, వెంకటస్వామి, గురునాథంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేనెప్పుడొస్తే అప్పుడే బడి

• టీచర్ నిర్వాకంతో స్కూల్ మూత



మూసేసిన పాఠశాల

కావలి(జలదంకి): కావలి రూరల్ మండలం లింగంగుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి దారుణంగా మారింది. ఇక్కడ నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కృష్ణ అనే టీచర్ విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఇతను తరచూ బడికి దుమ్మా కొడుతున్నాడని ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులకు మొబైల్‌లో మెసేజ్‌లు పెట్టి సెలవులు తీసేసుకుంటున్నాడు. ఒకే టీచర్ కావడంతో పాఠశాలను మూసివేయాల్సి వస్తుంది. రెండు రోజులుగా బడికి తాళాలు వేసి ఉన్నారు. దీంతో తల్లిదండ్రులు పిల్లల చదువులపై ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై కావలి ఎంఈఓ గోవిందయ్యను వివరణ కోరగా కృష్ణ సెలవు పెట్టినట్లు తనకు తెలియదన్నారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్యశాఖలో జేడీ విచారణ



జేడీకి అర్జీని అందజేస్తున్న నాగరాజు

నెల్లూరు(అర్బన్): వైద్యారోగ్య శాఖలో ఉప్పలపాటి నాగరాజు అనే వ్యక్తి మరో ఉద్యోగిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేడీ మల్లేశ్వరి మంగళవారం విచారణ జరిపారు. ఫిర్యాదుదారుడు పేర్కొన్న అంశాలకు సంబంధించి ఎస్‌ఆర్‌హెచ్‌ఎంలో సందీప్ అనే వ్యక్తి పనిచేస్తూ బదిలీపై తిరుపతికి వెళ్లాడు. అయినా అతను నెల్లూరులో పనిచేస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడని, గతంలో డీఎంహెచ్‌ఓకి అద్దె కారు పెట్టి ప్రైవేట్ డ్రైవర్‌ను పెట్టకుండా ప్రభుత్వ డ్రైవర్‌ను వినియోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే కాకుండా ఎస్‌ఆర్‌హెచ్‌ఎంలో ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టుల భర్తీలో రోస్టర్ పద్ధతి పాటించలేదని దానిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ అంశాలపై విచారణ అధికారిగా వచ్చిన జేడీకి మరో అర్జీని నాగరాజు అందజేశారు. అయితే విచారణ గురించి ఎవరికీ తెలియకుండా రహస్యంగా నిర్వహించారు.

కరేడులో మహిళా సంఘాల ఐక్యవేదిక పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు

ఉలవపాడు: కరేడు గ్రామంలో మహిళా సంఘాల ఐక్యవేదికకు చెందిన వారు మంగళవారం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ జీఓ నంబర్ 43ను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. నిరుపయోగంగా కాకినాడ సెజ్‌లో చాలా భూమి ఉందన్నారు. అలాంటి చోట పరిశ్రమలు పెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో 1,200 రోజులుగా పోరాడుతున్న రైతులు విజయం సాధించారన్నారు. కరేడు రైతుల కోసం తాము కూడా పోరాడి విజయం సాధిస్తామని తెలిపారు. అరకొర ఉన్న పొలాలు లాగేసుకుంటే రైతులు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో అఖిల భారత మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు వనజాక్షి, ఐద్వా సహాయ కార్యదర్శి రమణి, రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

ఉదయగిరి: ఉదయగిరిలో ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్ ఆస్తి వివాదమై ఈనెల 11వ తేదీ సాయంత్రం జరిగిన హత్య కేసులో నిందితులు మంగళవారం రాత్రి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. ఈ కేసులో షేక్ మహ్మద్ హమీద్‌ను వరుసకు బావలుగా ఉన్న గుంటుపల్లి మహ్మద్ హనీఫ్, ఉమర్‌అలీ సోదరులు అత్యంత కిరాతకంగా జనం చూస్తుండగానే హత్య చేశారు. 13 కత్తిపోట్లు, 3 రాడ్డు దెబ్బలున్నట్లు వైద్యులు గుర్తించారు. నిందితులు వివిధ ప్రాంతాల్లో తల దాచుకున్నట్లు తెలిసింది. ఈ హత్యను ఓ యువకుడు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించగా ఆ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. తాము కేసు నుంచి బయటపడటం తేలిక కాదని గ్రహించిన నిందితులు సమీప బంధువు ద్వారా పోలీసులకు లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో హత్య జరిగిన మరుసటిరోజు మధ్యవర్తి పోలీసులకు టచ్‌లోకి వచ్చి లొంగిపోవడానికి ప్రయత్నించినట్లు సమాచారం. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మంగళవారం రాత్రి వరికుంటపాడు పోలీసుల సమక్షంలో లొంగిపోయినట్లు తెలిసింది. వారిని దుత్తలూరు స్టేషన్‌కు తరలించారు. తర్వాత కావలికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుండగా ఎస్పీ కార్యాలయం ఆదేశాల ప్రకారం నెల్లూరుకు తరలించినట్లు సమాచారం.

‘పచ్చ’ని పేకాట

కూటమి ప్రభుత్వం వచ్చాక కందుకూరు నియోజకవర్గం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇటీవల నకిలీ మద్యం తయారీ కుంభకోణం వెలుగులోకి రాగా, తాజాగా కుటుంబాలను నాశనం చేసే పేకాట శిబిరాలతో కలకలం మొదలైంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చట్ట వ్యతిరేకంగా అడ్డమైన పనులు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి ఆగడాలకు అమాయకులు ప్రాణాలు కోల్పోతుండగా అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి.

• కందుకూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల శిబిరం
• రోజూ రూ.కోటికి పైగా చేతులు మారుతున్న వైనం
• రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వస్తున్న పేకాటరాయుళ్లు
• మద్యం, విందు ఏర్పాట్లు
• బయట వ్యక్తులు రాకుండా కాపలా



కందుకూరు: ఉలవపాడు మండలం రామాయపట్నం, చాకిచర్ల, గుడ్లూరు మండలం తెట్టు ప్రాంతాల్లో రోజూ ఏదో ఒకచోట పెద్ద ఎత్తున పేకాట శిబిరాన్ని మంత్రి నారా లోకేశ్ మనుషులు నిర్వహిస్తున్నారు. ఐదారు నెలలుగా రోజూ అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు జరుగుతోంది. కందుకూరు, సింగరాయకొండ, కావలి, ఒంగోలు, నెల్లూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లు తరలివస్తున్నారు. 25 నుంచి 30 మంది పాల్గొంటున్నారు. రోజూ రూ.కోటికి పైగా చేతులు మారుతున్నట్లు సమాచారం. ఒక్కొక్కరు రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. కోతముక్క, కోసు వంటి వివిధ రకాల ఆటలు నిర్వహిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా అర్ధరాత్రి ప్రత్యేకంగా లైట్లు ఏర్పాటు చేసి శిబిరం నిర్వహిస్తుండటం గమనార్హం. ఆడేవారి నుంచి నిర్వాహకులు ప్రత్యేకంగా ఎంట్రీ ఫీజులు తదితరాల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. అన్ని ఖర్చులు పోను శిబిరం నిర్వాహకులకు ఆదాయం రోజుకు రూ.లక్షల్లో ఉంటోంది.



ఘటనా స్థలంలో కారు (ఫైల్)

సకల ఏర్పాట్లు

పేకాటరాయుళ్లకు ఏ లోటు రాకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనిని చాకిచర్ల, పెదపట్టపుపాలేనికి చెందిన ఇద్దరు వ్యక్తులకు అప్పగించారు. మద్యం, భోజనాలు శిబిరం వద్దకు సరఫరా చేస్తారు. వీరు గ్రామంలో స్థానిక నాయకులు కావడంతో అడ్డు చెప్పకుండా కొంత ఆదాయం వచ్చేలా ఈ కాంట్రాక్ట్‌ను అప్పజెప్పారు. కొందరికి గంజాయిని అందిస్తుండటం విశేషం.

ప్రత్యేకంగా తరలిస్తూ..

శిబిరంలో పాల్గొనే వారిని తరలించేందుకు నిర్వాహకులు ప్రత్యేక రవాణా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎవరైనా సరే జాతీయ రహదారిపై ఉన్న తెట్టు వరకే కారులో రావాల్సి ఉంటుంది. అక్కడ పార్కింగ్ చేస్తే నిర్వాహకులు బైక్‌లపై అడవుల్లో ఏర్పాటు చేసిన శిబిరానికి తరలిస్తారు. ముగిసిన తర్వాత బైక్‌లపై తీసుకెళ్లి కార్ల వద్ద వదిలేస్తారు. అదే సందర్భంలో పేకాట శిబిరం వద్దకు బయట వ్యక్తులు రాకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను కూడా పెట్టారు. స్థానికంగా ఉండే 10 నుంచి 15 మంది యువకులను నియమించారు. వీరు అటు వైపు ఎవరైనా వస్తున్నారేమోనని నిఘా ఉంచుతారు. కొత్త వ్యక్తుల సమాచారం ఉంటే వెంటనే నిర్వాహకులను చెబుతున్నారు. దీనికి గానూ ఒక్కొక్కరికి రోజుకు రూ.2,000 ఇస్తున్నారు.

పోలీసులకు భారీగా మామూళ్లు

ఇంత జరుగుతున్నా పేకాట శిబిరం గురించిన సమాచారం పోలీసులకు తెలియదా అంటే కచ్చితంగా తెలుసు. ఎవరు నిర్వహిస్తున్నారు?, ఏ ప్రాంతంలో ఏ రోజు ఆట జరుగుతుంది? అనే పక్కా సమాచారం ముందుగానే వారికి చేరుతుంది. అయినా ఆ వైపు కన్నెత్తి చూడకపోవడానికి కారణం మామూళ్ల మత్తులో జోగుతుండటమే. గుడ్లూరు, ఉలవపాడు పోలీసులకు రోజుకు రూ.30 వేలు మామూళ్లు ఈ శిబిరం నుంచి వెళ్తున్నట్లు సమాచారం. ఈ కారణంతోనే చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అదే సందర్భంలో ఎక్సైజ్ శాఖ అధికారులను కూడా మేనేజ్ చేసుకుంటున్నారు. కాగా ఆదివారం అర్ధరాత్రి పరకొండపాడు గ్రామానికి చెందిన తూమాటి లక్ష్మయ్య (49) అనే వ్యక్తి పేకాట శిబిరానికి వెళ్తుండగా కారు ప్రమాదంలో చనిపోయిన విషయం తెలిసిందే. ఇప్పటికే అనేక కుటుంబాలు ఆర్థికంగా దెబ్బ తింటున్నాయి. నేడు ప్రాణాల మీదకు వస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు

• కలెక్టర్ ఆనంద్
• అల్లూరు మండలంలో విస్తృతంగా పర్యటన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

అల్లూరు: ప్రభుత్వ లేఅవుట్లలో వేగంగా ఇళ్ల నిర్మాణాలను చేసి లబ్ధిదారులు నివాసం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత అల్లూరు – 2 పరిధిలోని నాగులదేవిగుంట వద్ద ఉపాధి హామీ కింద చేస్తున్న కాలువ పూడికతీత పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎన్ని పనిదినాలు పూర్తి చేశారు?, ఎంత వేతనం పొందుతున్నారు?, ఉపాధి పనులే కాకుండా వేరే పనులు చేస్తున్నారా? అని ఆరాతీశారు. తర్వాత రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ లేఅవుట్‌ను పరిశీలించారు. స్థానికులు మాట్లాడుతూ నీటి వసతి లేనందున పూర్తయిన గృహాల్లో ఇంకా చేరలేదని తెలియజేశారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ నీటి వసతి కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీఆర్ కాలనీలో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వంశీకృష్ణ, అల్లూరు తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మా భూములు, ఇళ్లు ఇచ్చేది లేదు



సమావేశంలో పాల్గొన్న గిరిజనులు

• గిరిజనుల నిర్ణయం

ఉలవపాడు: పరిశ్రమల కోసం భూములు, ఇళ్లు ఇచ్చేది లేదని గిరిజనులు తీర్మానించారు. కరేడు ఎస్టీ కాలనీలో ఐదు కుగ్రామాల యానాదులు సోమవారం రాత్రి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వడానికి ఇష్టం లేదని చెప్పారు. జీఓ వచ్చిన తర్వాత గ్రామసభ నిర్వహించకుండా పొలాలకు, ఇళ్లకు నోటీసులు పంపించారు. సభ ఏర్పాటు చేసిన తర్వాత యానాది వర్గానికి 70 శాతం మంది భూములివ్వడానికి సిద్ధంగా ఉన్నారని అపోహను ప్రభుత్వం కల్పించింది. దీంతో వారు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మర్రిచెట్టు సంఘం, బాలకోటయ్య సంఘం, ఆకుతోట సంఘం, పొల్లు గట్టు సంఘం, ధర్మారెడ్డి సంఘం, మంద బయట సంఘం, అలగాయపాళెం ఎస్టీ కాలనీలకు చెందిన సభ్యులు చర్చించి భూములు ఇవ్వబోమని తీర్మానించారు. కార్యక్రమంలో యానాది సంఘం నాయకులు కత్తి బాలకోటయ్య, చేవూరి శ్రీనివాసులు, నటరాజు సురేష్, మస్తానమ్మ, పోలమ్మ, మాలకొండయ్య, సురేష్, వసంతమ్మ, చౌటూరి వెంకటరావు, కత్తి చెంచయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అరాచకాలు తప్ప అభివృద్ధి లేదు

• సూపర్ సిక్స్‌తోపాటు ప్రజాపథకాలకు మంగళం
• అవినీతి, అక్రమ కేసులతో వేధించడమేనా సుపరిపాలనా?
• కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న రామిరెడ్డి, నాయకులు

బిట్రగుంట: కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమ కేసులు తప్ప అభివృద్ధి జాడే కనిపించడం లేదని కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కావలి నియోజకవర్గం ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ జువ్వలదిన్నె వద్ద సుమారు రూ.340 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తీరుపై వ్యంగాస్త్రాలతో మండిపడ్డారు. అభివృద్ధి అంటే మీడియాలో, సోషల్ మీడియాలో ఫొటోలకు ఫోజులివ్వడం కాదని తెలుసుకోవాలన్నారు. పదేపదే కావలిని కాపు కాస్తా, బోగోలును కాపు కాస్తా, మీ గ్రామాన్ని దత్తత తీసుకుంటా అంటూ ఊతపదాలు వల్లెవేయడం కాదని, ప్రజలకు ఇప్పటి వరకూ ఏం మంచి చేశారో చెప్పాలన్నారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు చేస్తున్న ఆగడాలను గుర్తించాలని సూచించారు.

• వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు మాట్లాడుతూ ఏనుగులబావిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై వందలాది మంది చూస్తుండగానే కత్తులతో దాడి చేయడమే కాకుండా చివరకు బాధితులపై హత్యాయత్నం కేసులు పెట్టి నెలరోజులపాటు జైల్లో మగ్గేలా చేశారన్నారు. కడనూతలలో కూడా అమాయకులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారని వివరించారు. మహిళా జర్నలిస్ట్ అని కూడా చూడకుండా బోగోలుకు చెందిన యువతిపై ఐదు అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మద్దిబోయిన పద్మ, నాయకులు మేకల శ్రీనివాసులు, ఏకే సుందర్‌రాజు, కల్యాణ్ కుమార్, కర్తం సురేందర్‌రెడ్డి, తుమ్మల రమణయ్య నాయుడు, పర్రి అంకులయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సరైన బిల్లులు లేకపోవడంతో..



ఆత్మకూరు: తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

• పురుగు మందుల అమ్మకాల నిలిపివేత

చేజర్ల(ఆత్మకూరు): సరైన బిల్లుల్లేని రూ.4 లక్షల విలువైన పురుగు మందుల అమ్మకాలు నిలిపివేయాలని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సీహెచ్ రవికుమార్ ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయం నుంచి రవికుమార్‌తో పాటు విజిలెన్స్ అధికారి రాఘవరావు చేజర్ల మండలంలోని ఆదూరుపల్లిలో పలు ఆగ్రో సర్వీస్ ఫర్టిలైజర్ షాపుల్లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పురుగు మందులకు సరైన సర్టిఫికెట్లు, బిల్లులు లేకపోవడంతో అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట జిల్లా వ్యవసాయ అధికారులు ఏడీఏ నర్సోజీరావు, శివనాయక్, స్థానిక వ్యవసాయ అధికారిణి హిమబిందు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



కోవూరు : గోదామును తనిఖీ చేసిన అధికారులు

రూ.3.24 లక్షల విలువైన నిల్వలపై స్టే

కోవూరు: మండలంలో ఎరువులు, పురుగు మందుల గోదాముల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, సహాయ వ్యవసాయ సంచాలకుడు వినుకొండ రవికుమార్, మండల వ్యవసాయ అధికారిణి నీరజ తదితరులు పలు డిపోల్లో లైసెన్స్ లేకుండా పురుగు మందులు నిల్వ పెట్టినట్లు గుర్తించారు. రూ.3,24,650 విలువైన పురుగు మందుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలు

• విలువ రూ.50 లక్షలు
• నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

ఆత్మకూరు: నియోజకవర్గ పరిధిలోని చేజర్ల అటవీ ప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధం చేసిన ఎర్రచందనంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు ఆధ్వర్యంలో ఎస్పీ పి.శ్రీనివాస్ నేతృత్వంలో ఆర్ఐ సాయిగిరిధర్, ఆర్‌ఎస్ఐ లింగాధర్ బృందం, స్థానిక ఎఫ్‌బీఓ ఐ.జనార్దనతో కలిసి సోమవారం రాత్రి నుంచి చేజర్ల అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున వీరు కలువాయి ఫారెస్ట్ బీటు పరిధికి చేరుకోగా, అక్కడ కారు, బైక్‌తో కొందరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. 192 దుంగల్లో కొన్నింటిని పలకలుగా మార్చారు. వాటిని, మరికొన్ని దుంగల్ని అడవిలో ఉంచినట్లు నిందితులు చెప్పారు. వాటిని చెన్నైకి తరలించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు.

‘శుభాంశు’కు స్వాగతం



శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి చేరుకున్న సందర్భంగా అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. వెల్కమ్ శుభాంశు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. – సోమశిల

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 112
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 190

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5